క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పిడుగురాళ్ల: పట్టణంలోని పలు ప్రాంతాల్లో శనివారం విద్యుత్‌కు అంతరాయం కలుగుతుందని పట్టణ విద్యుత్ శాఖ ఏఈ ఆరికట్ల శివ నాగిరెడ్డి శుక్రవారం తెలిపారు. పట్టణంలోని 11 కేవీ సబ్ స్టేషన్ మరమ్మత్తుల కారణంగా అంతరాయం ఏర్పడుతుందని తెలిపారు. తహశీల్దార్ కార్యాలయం నుండి గుంటూరు బస్టాండ్ వరకు మెయిన్ రోడ్డుకు తూర్పు వైపు మాయాబజారు సెంటర్, పోలీస్‌స్టేషన్ సెంటర్ వరకు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని శివనాగిరెడ్డి తెలిపారు.

డాక్టరేట్ అందుకోవడం అభినందనీయం



మాచర్ల రూరల్: కళాశాలలో అధ్యాపకురాలుగా విద్యార్థులకు ఉత్తమ బోధన అందిస్తూ ఇంగ్లీష్‌లో డి.తిర్సా పీహెచ్‌డి డాక్టరేట్ అందుకోవడం అభినందనీయమని న్యూటన్స్ ఇంజనీరింగ్ కళాశాల కరస్పాండెంట్ జున్నా శ్రీనివాసరెడ్డి కొనియాడారు. శుక్రవారం మండలంలోని న్యూటన్స్ ఇంజనీరింగ్ కళాశాలలో అధ్యాపకురాలు డి.తిర్సా పీహెచ్‌డి డాక్టరేట్ అందుకున్న సందర్భంగా అభినందించి మాట్లాడారు. ''మేకింగ్ ఆఫ్ ది ఉమెన్ ఇన్ శశి దేశ్‌పాండే'' నవలపై పరిశోధన గ్రంథాన్ని సమర్పించిన ఈమెకు తమిళనాడులోని కోయంబత్తూరులోని భారతీయర్ యూనివర్శిటీ నుంచి పిహెచ్‌డి డాక్టరేట్ ప్రదానం చేయడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా తిర్సాను ప్రిన్సిపాల్ డాక్టర్ జగదీష్‌రెడ్డి, అధ్యాపకులు, హెచ్‌ఓడిలు ఘనంగా సత్కరించారు.

కష్టంతో కాకుండా ఇష్టంతో చదవాలి

కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో సక్సెస్ మీట్



మాచర్ల : చదువును కష్టంతో కాకుండా ఇష్టంతో చదివితే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని ఎస్.రాజను, మానుకొండ సాంబిరెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు పాఠశాలలో శుక్రవారం అభినందన సభ నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిలుగా కృష్ణవేణి టాలెంట్ స్కూల్స్, ది మాస్టర్ మైండ్స్ స్కూల్స్ ఫౌండర్ చైర్మన్ ఎస్.రాజు, మానుకొండ సాంబిరెడ్డి పాల్గొన్నారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ మారుతున్న కాలానుగుణంగా విద్యార్థులకు సులభతరమైన రీతిలో మంచి విద్యను అందించాలన్నారు. ప్రతి విద్యార్థికి జీవితంలో పాఠశాల స్థాయి విద్య ఎంతో ముఖ్యమైనదన్నారు. కృష్ణవేణి టాలెంట్ స్కూల్ పదో తరగతి పబ్లిక్ పరీక్ష ఫలితాల్లో అత్యుత్తమ ఉత్తమ ప్రతిభ కనపరిచిన విద్యార్థులకు పాఠశాల చైర్మన్ రాజు, అతిథులు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ హనుమంతరావు, యాజమాన్యం శ్రీధర్ గుప్తా, సదాశివరాజు, హరీష్ చంద్ర, స్కూల్ ఇన్‌చార్జిలు గౌరీ, నాగజ్యోతి , బాజీ, శ్రీలక్ష్మి రెడ్డి, అంజి నాయక్, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు, వారి తల్లితండ్రులు పాల్గొన్నారు.

అక్రమ మద్యం కేసులో నిందితుడి అరెస్ట్

నరసరావుపేట టౌన్: అక్రమ మద్యం కేసులో నిందితుడిని అరెస్ట్ చేసి అతని వద్ద నుంచి 30 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో సీఐ నయనతార శుక్రవారం తెలిపారు. ఆర్టీసీ బస్టాండ్ వద్ద తనిఖీలు నిర్వహించి అక్రమంగా మద్యం కలిగి ఉన్న దుగ్గి రాఘవులను అరెస్ట్ చేశామన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి నిందితుడిని కోర్టులో హాజరు పరిచినట్లు సీఐ తెలిపారు.

నేడు వడియరాజుల ఆత్మీయ సమావేశం

నరసరావుపేట: స్థానిక పెద్దచెరువులోని కాసు కన్వెన్షన్ సెంటర్‌లో శనివారం ఉదయం 10గంటలకు వడియరాజుల ఆత్మీయ సమావేశం నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్ సీపీ శాసనసభ అభ్యర్థి కార్యాలయం శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొంది. దీనికి ముఖ్యఅతిథులుగా పార్లమెంటు, అసెంబ్లీ అభ్యర్థులు డాక్టర్ పి.అనిల్‌కుమార్ యాదవ్, డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డితో పాటు ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నం , రాష్ట్ర వడ్డెర కార్పొరేషన్ చైర్మన్ దేవళ్ల రేవతి, జిల్లా వడ్డెర సంఘ నాయకులు పాల్గొంటారు. నియోజకవర్గంలోని వడ్డెర నాయకులు, వడ్డెరలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు అందరూ హాజరై జయప్రదం చేయాలని కోరారు.

అంకమ్మతల్లి వార్షికోత్సవంలో ఎమ్మెల్యే నంబూరు

క్రోసూరు: క్రోసూరు కొండ కింద బజారులోని అంకమ్మతల్లి వార్షికోత్సవం శుక్రవారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నంబూరుశంకరరావు పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవాలయ కమిటీ, భక్తులు ఎమ్మెల్యేను ఘనంగా స్వాగతించి సత్కరించారు.

మాచర్ల అసెంబ్లీ బరిలో 15మంది అభ్యర్థులు

ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఏ.శ్యామ్ ప్రసాద్



తహసీల్దార్ కార్యాలయంలో నామినేషన్లను పరిశీలిస్తున్న ఆర్‌వో శ్యామ్‌ప్రసాద్, పాల్గొన్న పార్టీల ప్రతినిధులు

మాచర్ల రూరల్: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో నామినేషన్ ప్రక్రియలో 40 సెట్ల నామినేషన్లను 24 మంది అభ్యర్థులు దరఖాస్తు చేయగా వారిలో 9 మంది అనర్హతకు గురి కాగా 15 మంది ఫైనల్ అభ్యర్థుల జాబితాలో నిలిచారని ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఏ.శ్యామ్ ప్రసాద్ తెలిపారు. శుక్రవారం తహశీల్దార్ కార్యాలయంలో నామినేషన్ వేసిన అన్ని పార్టీల అభ్యర్థుల మధ్య నిర్వహించిన పరిశీలన అనంతరం ఆయన విలేకర్లతో మాట్లాడారు. కేంద్ర ఎన్నికల సంఘం నిబంధనల మేరకు ప్రతి అప్లికేషన్‌ను నిశితంగా పరిశీలించి 24 మందిలో 9 మందిని వివిధ అంశాలకు సంబంధించిన జాబితాను అందించకపోవటంతో వారిని తొలగించామని, 15 మంది అభ్యర్థులతో తుది జాబితాను ఖరారు చేసినట్లు చెప్పారు. వీరిలో వైఎస్సార్‌సిపి అభ్యర్థిగా పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, వై.రామచంద్రారెడ్డి, జూలకంటి బ్రహ్మనందరెడ్డి, బచ్చు వెంకటేశ్వర్లు, నవులూరి శివారెడ్డి, గుండాల సైదులు, గుమ్మడి కోటేశ్వరరావు, వై.కేశవరెడ్డి, సూర ప్రసాద్, విఆర్‌ఎస్ సత్యనారాయణచారి, షేక్ మాబుజాన్, కోటా రాజేష్, గోళ్ల శ్రీనివాసరావు, కుందూరి వీరారెడ్డి, డేగల సైదరాజు నామినేషన్‌లను ఖరారు చేసినట్లు పేర్కొన్నారు. ఈ పరిశీలన కార్యక్రమంలో వైఎస్సార్‌సిపి రాష్ట్ర యువజన ఉపాధ్యక్షుడు పిన్నెల్లి వెంకటరామిరెడ్డి, మరుమాముల శ్రీనివాసశర్మ, సీనియర్ న్యాయవాది చిలమకూరి నాగిరెడ్డి తదితరులున్నారు.

గురజాలలో 12 నామినేషన్లు తిరస్కరణ

బరిలో 25 మంది అభ్యర్థులు



మాట్లాడుతున్న రిటర్నింగ్ అధికారి జీవీ రమణాకాంత్ రెడ్డి

గురజాల: సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా నామినేషన్ల పరిశీలన కార్యక్రమం శుక్రవారం జరిగింది. స్థానిక రెవెన్యూ డివిజన్ కార్యాలయంలో రిటర్నింగ్ అధికారి జీవీ రమణాకాంత్ రెడ్డి మాట్లాడుతూ 25 మంది అభ్యర్థులు 37 నామినేషన్లు వేయగా వాటిలో శుక్రవారం జరిగిన పరిశీలనలో 12 నామినేషన్లు తిరస్కరించినట్లు చెప్పారు. తిరస్కరించిన వాటిలో ఒక నామినేషన్ సబ్ స్క్రైబ్ సరిగా లేకపోవడం వల్ల, ఒక నామినేషన్ అఫిడవిట్‌లో సంతకం లేకపోవడం, మూడు నామినేషన్లు అఫిడవిట్‌లో ఖాళీలు పూరించనందున, 7 నామినేషన్లు ప్రమాణం చేయనందున తిరస్కరణకు గురైనట్లు రిటర్నింగ్ అధికారి తెలిపారు. మొత్తం 25 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారని, 29వ తేది లోపు నామినేషన్లు ఉపసంహరణ చేసుకునే అవకాశం ఉందన్నారు.

174 పోలింగ్ బూత్‌లు సమస్యాత్మకం

నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో మొత్తం 304 పోలింగ్ బూత్‌లు ఉన్నట్లు వాటిలో రెవెన్యూ అధికారులు, పోలీస్ అధికారులు విస్తృతంగా పరిశీలించగా 174 పోలింగ్ బూత్‌లు సమస్యాత్మకంగా ఉన్నట్లు గుర్తించడం జరిగిందని రిటర్నింగ్ అధికారి తెలిపారు. ఎన్నికల సంఘం పొందుపరచిన 6 పాయింట్లను తీసుకుని వాటిని గుర్తించడం జరిగిందన్నారు. నియోజకవర్గంలోని 231 పోలింగ్ బూత్‌లలో వెబ్ కాస్టింగ్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. పోలింగ్ రోజున ఓట్లు వేయడానికి ఓటర్లకు ఇబ్బంది పడే బూత్‌లు నియోజకవర్గంలో 9 బూత్‌లు (పిన్నెల్లి, జంగమహేశ్వరపురం) ఉన్నాయని, మొత్తం 76 లోకేషన్లుగా ఉన్నాయన్నారు. 10 బూత్‌లలో మాత్రం వీడియో గ్రాఫర్ ద్వారా ప్రతి నిమిషం వీడియో తీసేలా చూడటం జరుగుతుందన్నారు. హోం ఓటింగ్‌కు కేవలం నియోజకవర్గంలో 18 మంది ఓటర్లు మాత్రమే దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. ఓటు స్లిప్‌లు వచ్చాయని, వాటిని త్వరలో పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. ప్రతి ఒక్కరూ విధిగా ప్రశాంతంగా ఓటు హక్కును వినియోగించుకునే విధంగా చర్యలు చేపట్టడం జరిగిందన్నారు.

జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేద్దాం

మాచర్ల ఎమ్మెల్యే అభ్యర్థి పీఆర్కే సతీమణి రమాదేవి



ఇంటింటి ప్రచారంలో పీఆర్కే సతీమణి రమాదేవి

విజయపురిసౌత్: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ మాచర్ల నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థి పిన్నెల్లి రామకృష్ణారెడ్డికి ఓట్లు వేసి అత్యధిక మెజారిటీతో మరోసారి గెలిపించాలని కోరుతూ పిన్నెల్లి సతీమణి రమాదేవి పలు గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం చేశారు. శుక్రవారం మాచర్ల మండలంలోని పశువేముల, బ్రహ్మనందపురం తండా, నాగులవరం గ్రామాల్లో ఆమె తన భర్తకు మద్దతుగా ఎన్నికల ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్ రెడ్డి పాలన పేదల సంక్షేమం, అభివృద్ధి ధ్యేయంగా పథకాలను అమలు చేశారన్నారు. నవరత్నాల పథకాలతో అన్ని వర్గాలకు సంక్షేమ ఫలాలు అందించటం, నాడు-నేడు కింద పాఠశాలలు, ఇతర ప్రజావసర భవనాలను, పలు అభివృద్ధి పనులకు కోట్లాది రూపాయల నిధులు వెచ్చించారన్నారు. ఈ కార్యక్రమంలో మాచర్ల ఎంపీపీ బూడిద మంగమ్మ, జె డ్పీటీసీ పెద్ద మల్లుస్వామి, వైస్ ఎంపీపీ సుజాత కోటిరెడ్డి, మాజీ జెడ్పీటీసీ బొమ్మిరెడ్డి సుబ్బారెడ్డి, జెసీఎస్ కన్వీనర్ శేరెడ్డి వీరారెడ్డి, పార్టీ మండల నాయకుడు బూడిద శ్రీనివాసరావు, రెంటచింతల మాజీ ఎంపీపీ దాసరి చౌడేశ్వరిదేవి, గ్రామ సర్పంచ్ గోగిరెడ్డి వెంకట్రావమ్మ వెంకటేశ్వరరెడ్డి, అనంతరావమ్మ, కొత్తపల్లి సర్పంచ్ ఓరుగంటి జయప్రకాష్‌రెడ్డి, పార్టీ మాచర్ల మండల ఎస్టీ సెల్ అధ్యక్షుడు బ్రహ్మనాయక్, నాయకులు పెరుమాళ్ళ వెంకట్రామయ్య, బూడిద సైదులు, మట్టపల్లి నారాయణ, మట్టపల్లి బ్రహ్మం, పండ్ల మంగయ్య, పండ్ల నారాయణ, పండ్ల అంజయ్య, కిన్నెర దేవదానం, కర్రా చిన్న రంగయ్య, చిన్నానాయక్, పర్వతాలు నాయక్, ఐనబోయిన శ్రీను, పొందుగుల సత్యనారాయణరెడ్డి, గన్నెబోయిన బాలరాజు, చవ్వా ఏడుకొండలు, వస్త్రపురి రాములు, బద్దెల పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడుగా కొమెర శ్రీను



శ్రీనుకు నియామక పత్రాన్ని అందజేస్తున్న పీఆర్కే

మాచర్ల: పాత మాచర్లకు చెందిన కొమెర శ్రీను వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పట్టణ బీసీ విభాగం అధ్యక్షుడిగా నియమితులయ్యారు. ఈ మేరకు ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి సిఫారసు మేరకు నియామక పత్రాన్ని రాష్ట్ర బీసీసెల్ విభాగం నుంచి పంపిన నియామక పత్రాన్ని పిన్నెల్లి రామకృష్ణారెడ్డి శుక్రవారం అందచేశారు. పార్టీ కోసం ఎంతో కృషి చేస్తున్న బీసీ విభాగం నాయకుడైన కొమెర శ్రీను సేవలను గుర్తించి సముచిత స్థానం కల్పించడం జరిగిందన్నారు. పార్టీ కోసం కష్టపడేవారికి రానున్న రోజుల్లో సముచిత స్థానం కల్పిస్తాన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు 50 శాతం రిజర్వేషన్ కల్పించడంతోపాటు, అన్ని రకాలుగా అభ్యున్నతికి కృషి చేస్తున్న వై.ఎస్.జగన్‌కు ప్రతి ఒక్కరూ మద్దతు పలకాలన్నారు. ఈ కార్యక్రమంలో వడ్డెర కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ దేవెళ్ల రేవతి, యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ కె.కోటయ్య, మాజీ మున్సిపల్ చైర్మన్లు తురకా కిషోర్, బత్తుల ఏడుకొండలు, వడ్డెర సంఘ నాయకులు మంజుల మల్లికార్జున్, చెన్నయ్య, వెంకట్రావు, వైఎస్సార్‌సీపీ విభాగం ప్రధాన కార్యదర్శి శ్రీనివాస శర్మ, కౌన్సిలర్లు, కొమెర పిచ్చయ్యతోపాటు, పలువురు వడ్డెర సంఘ నాయకులు పాల్గొన్నారు.

అభివృద్ధిని చూసి ఓట్లేయండి

జెడ్పీ వైస్ చైర్మన్ శొంఠిరెడ్డి నర్సిరెడ్డి



ఎన్నికల ప్రచారంలో జెడ్పీ వైస్ చైర్మన్ శొంఠిరెడ్డి నర్సిరెడ్డి

రెంటచింతల: మాచర్ల నియోజకవర్గంలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అమలుచేసిన సంక్షేమం, చేసిన అభివృద్ధిని చూసి సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి ఓట్లేయాలని జడ్పీ వైస్ చైర్మన్ శొంఠిరెడ్డి నర్సిరెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని జెట్టిపాలెం, మల్లవరం గ్రామాల్లో మాచర్ల వైఎస్సార్ సీపీ అభ్యర్థి పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, నర్సరావుపేట పార్లమెంట్ అభ్యర్థి అనిల్‌కుమార్ యాదవ్‌ను గెలిపించాలంటూ ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి తల్లి రాములమ్మ, చెల్లెలు జె.నాగమణి, పార్టీ నేతలతో కలిసి ప్రచారం చేశారు. దేశ చరిత్రలో ఏ రాష్ట్రంలో చేయని విధంగా రాష్ట్రంలోని ప్రతి గడపకు కుల, మత, రాజకీయ, వర్గం చూడకుండా సంక్షేమ ఫలాలు అందించిన ముఖ్యమంత్రి జగన్‌కు ప్రతి ఒక్కరం అండగా ఉందామన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు దావులూరి నాగమ్మ, వడితే సోనమ్మ, ఎంపీపీ పాముల సంపూర్ణమ్మ, మండల పార్టీ అధ్యక్షుడు గొట్టం బ్రహ్మారెడ్డి, మాజీ సర్పంచ్‌లు దావులూరి ఉదయ కుమారి రమేష్, మేకపోతుల బూర్రెడ్డి, జె. మంగ్లానాయక్, శీలం అంజయ్య, పార్టీ నాయకులు జువ్వాజి సాంబిరెడ్డి, మేకపోతుల శివారెడ్డి, వడితే బుడ్డసైదా, కుందురు పేర్రెడ్డి, బత్తుల కోటేశ్వరరావు, తిక్కా శ్రీను, ఎం. పరిశానాయక్, బుగ్గల సైదా, కొండా రామయ్య, బిక్కన్ వలి, కుందురు నర్సింహారెడ్డి, పేరువాళ్ల కోటయ్య, దేరంగుల గురవయ్య, డి. నాగరాజు, తదితరులున్నారు.

బీసీల పక్షపాతి జగనన్నకే రజకుల మద్దతు

రజక సంఘ ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు పి.అంజిబాబు



ఎమ్మెల్యే పీఆర్కేను కలిసి మద్దతు ప్రకటిస్తున్న రజక సంఘ ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు పి.అంజిబాబు

మాచర్ల రూరల్: జనాభా దామాషా ప్రకారం బీసీలకు రాజ్యాధికారం కట్టబెడుతున్న బీసీల పక్షపాతి జగనన్నకే రాష్ట్రంలోని రజకులంతా మద్దతుగా ఉండి గెలుపులో భాగస్వాములవుతామని రజక సంఘాల ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షులు పాతపాటి అంజిబాబు అన్నారు. శుక్రవారం ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డిని కలిసి సంపూర్ణ మద్దతు తెలియచేసి మాట్లాడారు. దేశంలో, ఏ రాష్ట్రంలో లేని విధంగా బీసీలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో నామినేటెడ్ పోస్టుల్లో నియమించడమే కాకుండా ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థుల్లో కూడా బీసీలకు అత్యధిక స్థానాలు కల్పించిన ముఖ్యమంత్రి ఒక్క జగన్‌మోహన్‌రెడ్డేనన్నారు. ప్రతి ఎన్నికల మేనిఫెస్టోలో రజకులను ఎస్టీ జాబితాలో చేరుస్తామని చెప్పి ఓట్లు, సీట్లు పొంది చంద్రబాబు రజకులను తీవ్రంగా మోసం చేశారని, అధికారంలో ఉన్నపుడు ఏ నాడూ చట్టసభల్లో రజకుల డిమాండ్లను ప్రస్తావించకపోవటం, జాతిని అవమానించి మోసం చేయటం కాదా అని ప్రశ్నించారు. చంద్రబాబు తిరుమల తిరుపతి దేవస్థానంలో ప్రాధాన్యత కల్పిస్తానని, దోబీఘాట్‌లకు హక్కులు కల్పిస్తానని చెప్పి మోసం చేశారని, అలాంటి మోసగాడికి ఎవరూ ఓటు వేయరని చెప్పారు. జగనన్న ఎన్నికల మేనిఫెస్టోలో చెప్పిన దానికంటే ఎక్కువగా చేసి బీసీల పక్షపాతిగా ఉన్న ఆయనకు రజకులమంతా అండగా ఉండి గెలుపులో భాగస్వాములమవుతామని స్పష్టం చేశారు. ఆయన వెంట రజక సంఘ నాయకులు నాగెండ్ల లక్ష్మీనారాయణ, చింతపల్లి అమరయ్య, నరమాలపాడు సీతారామయ్య, జమ్మలమడక చిన్న అంజి ఉన్నారు.

సంక్షేమానికి పట్టం కట్టండి

9వ వార్డు మున్సిపల్ కౌన్సిలర్ మాదాల కిరణ్‌కుమార్



9వ వార్డులో ప్రచారం నిర్వహిస్తున్న మాదాల కిరణ్‌కుమార్, వైఎస్సార్‌సీపీ నాయకులు

పిడుగురాళ్ల: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు అందించిన సంక్షేమ పథకాలకు పట్టం కట్టాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ 9వ వార్డు మున్సిపల్ కౌన్సిలర్ మాదాల కిరణ్‌కుమార్ అన్నారు. పట్టణంలోని 9వ వార్డులో శుక్రవారం ఇంటింటి ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి, గురజాల నియోజకవర్గంలో ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి చేసిన అభివృద్ధిపై కరపత్రాలను అందిస్తూ ఇంటింటి ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతి ఒక్కరు జరగబోయే సార్వత్రిక ఎన్నికల్లో గురజాల నియోజకవర్గ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డిని, నర్సరావుపేట పార్లమెంట్ అభ్యర్థి అనిల్‌కుమార్ యాదవ్‌లను ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి రాష్ట్ర ముఖ్యమంత్రిగా తిరిగి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించుకుందామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు ఒరుగంటి రవికుమార్, మారం రామారావు, పొల్లంబట్ల నాగేశ్వరరావు, పాదర్తి కృష్ణమూర్తి, ఎస్‌కే జానిఫీరా, ఎస్‌కే కొండా శివారెడ్డి, చల్లా అంకిరెడ్డి, బి. వెంకటరామిరెడ్డి, గాదె అనంతరామిరెడ్డి, కె. అనిల్‌కుమార్, టి. శ్రీనివాసరెడ్డి, శిరిష, ఉదయ్‌కిరణ్, మల్లిక, కృష్ణవేణి, మానస, జ్యోతిలు పాల్గొన్నారు.

మంత్రి అంబటికి క్రైస్తవ సంఘ కాపరుల ఆశీర్వాదాలు

సత్తెనపల్లి: సత్తెనపల్లి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్న రాష్ట్ర జలవనరుల శాఖా మంత్రి అంబటి రాంబాబును నియోజక వర్గంలోని క్రైస్తవ సంఘాల పాస్టర్లు ఇతర సంఘ కాపరులు శుక్రవారం తన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. వైఎస్సార్ సీపీనే మరోసారి అధికారంలోకి వస్తుందని, సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తానని మంత్రి అంబటి వారికి భరోసా ఇచ్చారు. రానున్న ఎన్నికల్లో దేవుని దీవెనలు మంత్రి అంబటి రాంబాబుకు ఉండాలని వారు ప్రార్థించి ఆశీర్వదించారు.కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు చిలుకా జైపాల్, నాయకులు జూపల్లి పాల్, పాస్టర్లు, సంఘ కాపర్లు ఉన్నారు.

వైఎస్సార్‌సీపీలోకి మైనార్టీ కుటుంబాలు చేరిక



వైఎస్సార్‌సీపీలో చేరిన ముస్లిం కుటుంబాలతో ఎమ్మెల్యే కాసు మహేస్‌రెడ్డి



ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరిన ముస్లిం మైనార్టీలు



మాదుగుల గ్రామంలో టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలో చేరిన కార్యకర్తలు



వైఎస్సార్‌సీపీలో చేరిన వారితో ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి

పిడుగురాళ్ల: మండల కేంద్రమైన మాచవరం గ్రామానికి చెందిన ముస్లిం, మైనారిటీకి చెందిన సుమారు 20 కుటుంబాలు టీడీపీని వీడి వైఎస్సార్ సీపీలో చేరారు. శుక్రవారం పిడుగురాళ్లలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మాచవరం మండల కో ఆప్షన్ సభ్యులు షేక్ మహ్మద్ జాని ఆధ్వర్యంలో గురజాల నియోజకవర్గ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి సమక్షంలో టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరారు. వారందరికి ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి వైఎస్సార్‌సీపీ కండువాలు కప్పి వైఎస్సార్‌సీపీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి మాట్లాడుతూ ముస్లిం, మైనారిటీల అభివృద్ధి కోసం, రాజకీయంగా, ఆరికంగా అన్నిరంగాల్లో అభివృద్ధి చేయడానికి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాజీ లేకుండా అహర్నిశలు కృషి చేస్తున్నామన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ముస్లింలకు రాజకీయంగా సముచిత స్థానం కల్పించారన్నారు. వైఎస్సార్‌సీపీలో చేరిన వారిలో షేక్ మాబు జాని(రియల్ ఎస్టేట్ జాని), షేక్ మహ్మద్, బెల్లంకొండ నాగులు, బెల్లంకొండ బాషా, బెల్లంకొండ రసూల్, బెల్లంకొండ బిస్మిల్లా, షేక్ బాజి, షేక్ బాషా, షేక్ రఫీ(ఆరేకే వెల్డింగ్), షేక్ మాబుజాని, షేక్ మహ్మద్ మోతాదు జాని, షేక్ నాగుల్ మీరా, షేక్ సైదా, షేక్ మస్తాన్‌బాబు, షేక్ షఫీ, షరీఫ్‌లతోపాటు పలువురు వైఎస్సార్‌సీపీలో చేరారు. ఈ కార్యక్రమంలో మాచవరం మండల కో ఆప్షన్ సభ్యులు షేక్ మహ్మద్ జానితోపాటు వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలో చేరిన మైనారిటీ సోదరులు

మాచవరం : మండల కేంద్రమైన మాచవరం గ్రామానికి చెందిన మైనారిటీలు తెలుగుదేశం పార్టీని వీడి ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. మండల కో-ఆప్షన్ మెంబర్ షేక్ మహమ్మద్ జానీ ఆధ్వర్యంలో సుమారు 40 కుటుంబాలు వైఎస్సార్ సీపీలో చేరారు. వారికి ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన వారు మాట్లాడుతూ రాష్ట్రంలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు, పాలనా విధానానికి ఆకర్షితులై వైఎస్సార్‌సీపీలో చేరుతున్నట్లు తెలిపారు. టీడీపీ నాయకుల విధానాలతో విసుగుచెంది వైఎస్సార్‌సీపీలో చేరామని తెలిపారు. పార్టీలో చేరిన వారిలో షేక్ మాబు జానీ, బెల్లంకొండ నాగుల, బాషా, రసూల్, బిస్మిల్లా, బాజీ, బాషా, రఫీ, మోతాదు జాను, మాబుజానీ, నాగులమీరా, షరీఫ్, మస్తాన్ బాబు, షైదా తదితరులు ఉన్నారు.

టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలోకి చేరికలు

గురజాల: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ విధి విధానాలు నచ్చి సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అందిస్తున్న సంక్షేమ పథకాలకు మెచ్చి తెలుగుదేశం పార్టీ నుంచి వైఎస్సార్ సీపీలోకి చేరికలు జరిగాయి. శుక్రవారం మాదుగుల గ్రామానికి చెందిన 30 కుటుంబాలు వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ సిద్దాడపు గాంధీ, మాజీ సర్పంచ్‌లు బండ్ల వెంకయ్య, మాచర్ల బాబు, సాగర్ బాబుల ఆధ్వర్యంలో 30కుటుంబాలు వైఎస్సార్‌సీపీ తీర్థం పుచ్చుకున్నారు. వీరిని ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.ఈ కార్యక్రమంలో గ్రామ నాయకులు వెంకట శివ, కంపసాటి అంజి తదితరులున్నారు.

టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరిక

పిడుగురాళ్ల : టీడీపీని వీడి పలువురు వైఎస్సార్‌సీపీలో చేరారు. పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో శుక్రవారం గురజాల మండలం మాదుగుల గ్రామానికి చెందిన పలువురు వైఎస్సార్‌సీపీలో చేరారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ సిద్దాడపు గాంధీ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే కాసు మహేష్ రెడ్డి సమక్షంలో మోటపోతుల గోవిందరాజు, పల్లపాటి జానయ్య, పి. చెన్నకేశవలు, బి. వెంకట నారాయణలను ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి వైఎస్సార్‌సీపీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో కంపాటి వీరాంజనేయులు, సంకుల వెంకట శివయ్యలతోపాటు పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

సమస్యాత్మక గ్రామాలపై నిఘా నేత్రం



సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తున్న దృశ్యం

దాచేపల్లి: సమస్యాత్మక గ్రామాలపై పోలీసులు నిఘా పెట్టారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో మండల వ్యాప్తంగా గుర్తించిన అత్యంత సమస్యాత్మక గ్రామాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నారు. సీఐ ఎ. సురేంద్రబాబు ఆధ్వర్యంలో సమస్యాత్మక గ్రామాలైన నడికుడి, దాచేపల్లి, కేసానుపల్లి, మాదినపాడు, రామాపురం, పొందుగల, భట్రుపాలెం, తంగెడ గ్రామాల్లో సీసీఐ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నారు. గ్రామాల్లోని ప్రధాన కూడళ్లు, పోలింగ్ కేంద్రాలకు రాకపోకలు సాగించే ప్రధాన మార్గాలు, గొడవలు ఎక్కువగా జరిగే ప్రాంతాల్లో సీసీ కెమెరాలు అమర్చుతున్నారు. గ్రామాల్లో ప్రత్యేక బలగాలను మోహరించటంతో పాటు ఘర్షణలు జరిగితే సీసీ కెమెరాల్లో రికార్డు అయ్యేలా ఏర్పాట్లు చేస్తున్నారు. ఎన్నికల కమిషన్‌తో పాటు స్థానిక పోలీస్ అధికారులు సీసీ కెమెరాల్లో నమోదు అయ్యే దృశ్యాలను ఎప్పటికప్పుడు పరిశీలన చేస్తారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నామని, సీసీ కెమెరాల ఏర్పాటుతో పోలింగ్ సరళి, గ్రామాల్లో పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేస్తుంటామని సీఐ సురేంద్రబాబు చెప్పారు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించిన డిప్యూటీ డీఎంహెచ్‌ఓ

రాజుపాలెం: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని పల్నాడు జిల్లా డిప్యూటీ వైద్య ఆరోగ్య శాఖాధికారి హనుమకుమార్ శుక్రవారం పరిశీలించారు. మిడ్‌లెవెల్ హెల్త్ ప్రొవైడర్స్, మహిళా ఆరోగ్య కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నెలకు 5 కాన్పులు ప్రభుత్వ వైద్యశాలలో జరిగేలా చొరవ చూపాలన్నారు. రికార్డులు, రిపోర్టుపై పూర్తి అవగాహనతో మెలగాలన్నారు. ప్రస్తుతం ఎండలు తీవ్రంగా ఉన్నందున వడదెబ్బ తగలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలను అప్రమత్తం చేయాలని ఆదేశించారు. ఓఆర్ ఎస్ ప్యాకెట్లు అందరికీ అందుబాటులో ఉండేలా చూడాలని వైద్యుడు రవితేజా నాయక్ కు సూచించారు.

ఆదర్శ ఉద్యోగులకు సత్కారం

అభినందించిన ఆర్టీసీ సిబ్బంది



సత్తెనపల్లి: విధి నిర్వహణలో అంకిత భావంతో పని చేసిన ఆర్టీసీలోని ఐదుగురు ఆదర్శ ఉద్యోగు లకు శుక్రవారం డిపో ఆవరణలో సత్కరించారు. ఆర్టీసీలో విధులు నిర్వహిస్తున్న ఇరువురు డ్రైవర్లు ఇంధన ఆదా విభాగంలో ఉత్తమ ప్రతిభ కనబరిచారు. షేక్ కరీముల్లా, డీఎస్ రావులు ప్రథమ, ద్వితీయస్థానంలో నిలిచారు. అత్యధిక లక్ష్య సాధన విభాగంలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన కండక్టర్లు ఎమ్.వి.రావు షేక్ షంషుద్దీన్, టి.కె. రావులను డిపో మేనేజర్ జీఎస్ వీవీకే కుమార్ సత్కరించి నగదు బహుమతులను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగులు విధి నిర్వహణలో చిత్తశుద్ధి కనబరిస్తే ఉన్నత శిఖరాలను చేరుకోవచ్చన్నారు. ఆర్టీసీకి ఇంధన ఆదా, ఆదాయ లక్ష్య సాధన అనేవి కీలకమన్నారు. ఈ రెండు అంశాల్లో ఉద్యోగులు ఆదర్శంగా నిలవాలని సూచించారు కార్యక్రమంలో పర్యవేక్షకులు, సమాఖ్య ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.